క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు

పిఠాపురం: మాస శివరాత్రి సందర్భంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలో కొలువై ఉన్న రామలింగేశ్వరుడికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీరబాబు దత్తులు మాట్లాడుతూ మహన్యాస పారాయణం చేసి పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీపాద శ్రీవల్లభునికి లక్ష బిల్వార్చన



బిల్వాలతో అర్చన చేస్తున్న అర్చకులు

పిఠాపురం: స్థానిక దత్త పుణ్య క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి సందర్భంగా బుధవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఈఓ సౌజన్య తెలిపారు. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దన్ తెలిపారు.

ఓటర్ల రీసర్వే సక్రమంగా పూర్తి చేయాలి



వేట్లపాలెంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆర్డీఓ

సామర్లకోట: ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా కచ్చితంగా ఉండేలా బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని పెద్దాపురం ఎన్నికల అధికారి, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వేట్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఓటరు లిస్టు సర్వేను ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓలకు సూచనలు ఇచ్చారు. గ్రామంలో ఉన్న 15 పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు ఆర్.శ్రీనివాసు, రీ సర్వే డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ జయబాబు

కొత్తపల్లి: గ్రామాలను ప్రగతిపథంలో నడిపించడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని సర్పంచ్ పులి జయబాబు అన్నారు. మండలంలోని అమరవల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించాలి



సీఐ దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేసిన మానవహక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: వివిధ కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్‌లను పరిశీలించాలని జిల్లా మానవహక్కుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ కె.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సు చక్రం ఊడిపోవడంతో విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పిందని మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఏర్పడకుండా సామర్లకోట మీదుగా రాకపోకలు సాగే ప్రైవేటు స్కూల్ బస్సులను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘ నాయకులు కుంచే నానిబాబు, ఎండీ వల్లీ బాషా, జుత్తక అప్పారావు పాల్గొన్నారు.

పచ్చని తోటల్లో పాఠాలు

- ప్రతివారం రైతులకు సాగుపై అవగాహన
- వాణిజ్య పంట నష్ట నివారణకు ముందస్తు చర్యలు
- ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో 'తోటబడి'



ఆర్‌బీ పట్నంలో పామాయిల్ రైతులకు తోటబడిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: అక్కడ రైతులే విద్యార్థులు.. అధికారులే ఉపాధ్యాయులు.. పచ్చని తోటల మధ్య రైతులకు వ్యవసాయాధికారులు పాఠాలు నేర్పుతున్నారు. ఇప్పటి వరకు వరి, అపరాల సాగుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహించేవారు. మరి ఉద్యాన పంటలపై అవగాహన కల్పించేందుకు గాను ఎటువంటి కార్యక్రమాలు లేవని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యాన వన రైతుల కోసం ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో 'తోటబడి' కార్యక్రమాన్ని రూపొందించారు. వాణిజ్య పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయ, ఉద్యాన వన శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తోటబడిలో భాగంగా మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపు, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోగాత్మకంగా రైతులకు వివరణ

తోటబడి కార్యక్రమంలో రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేయడంతోపాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలార్జనకు పాటించాల్సిన పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులను వినియోగించకుండా ప్రకృతి సాగుతో పంటలు ఎలా పండించవచ్చో, సస్య రక్షణ చేపట్టే చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి పంట చేతికందే వరకు ఎప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను రైతులకు సూచిస్తూ ఉద్యాన పంటలపై మరింత ఆసక్తి కనబర్చేలా తోటబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రతి శుక్రవారం ఓ గ్రామంలో..

గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందికి ముందుగా శిక్షణ ఇచ్చి ప్రతి శుక్రవారం ఆయా తోటల్లో రైతులకు తోటబడి కార్యక్రమం పేరుతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విత్తనం నాటిన రోజు నుంచి 14 వారాల పాటు తోటబడి నిర్వహించి రైతులకు సాగుపై మరింత ఆసక్తి పెరిగేలా చేస్తున్నారు. సేంద్రియ పద్ధతులో ఎరువుల తయారీ, పక్షుల స్థావరాల ఏర్పాటు, పక్షులను ఆకర్షించే విధానాలపై రైతులకు సస్య రక్షణ చర్యలు వివరిస్తున్నారు.

12 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు

పెద్దాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 12వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. పెద్దాపురం మండలంలో మెట్ట గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాలు, రంగంపేట మండలంలో 6,500 ఎకరాలు, సామర్లకోట మండలంలో 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

ఉద్యాన పంటల రక్షణకే 'తోటబడి'



రైతులకు పొలంబడి మాదిరిగానే ఉద్యాన పంటల రక్షణకు తోటబడి కార్యక్రమం ఉపయోగపడుతోంది. ప్రధానంగా మామిడి, జీడి మామిడి, వంగ, బెండ, దొండ, మిరప, బీర, గుమ్మడి, అరటి, పామాయిల్ తదితర పంటలకు తరచూ వచ్చే తెగుళ్లు, చీడపీడల నివారణకు చేపట్టాల్సి చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో ఒక ఎకరం భూమిలో ఉన్న తోటలనే ప్రమాణికంగా తీసుకుని విత్తనం నాటిన నుంచి సేంద్రియ ఎరువులతో సాగు చేయించడమే తోటబడి ప్రధాన ఉద్దేశం.

– ఎన్.సుజాత, ఉద్యాన శాఖాధికారి, పెద్దాపురం

సమస్యలపై ప్రైవేటు టీచర్ల వినతి



ఎమ్మెల్యే దొరబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల నాయకులు

పిఠాపురం: అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలసి సమస్యలు వివరించారు. పీఎఫ్, ఈఎస్ఐ అందించడం ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సంఘం నాయకులు కిరణ్‌కుమార్ రాజు, ఎండీ హబీబ్ బాషా, వీఆర్ఆర్ జీనా, దడాల సుబ్రహ్మణ్యం, వి.రామకృష్ణారెడ్డి, ఎన్.వేణుగోపాల్, శాంతి, నల్లి నాగార్జున, రామకృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

కోనేరులో అవినీతిపై విచారణ చేపట్టాలి

- పంచారామ ట్రస్టు బోర్డు తీర్మానం
- ముగిసిన ట్రస్టు బోర్డు పదవీ కాలం



సామర్లకోట పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సమావేశం



ట్రస్టు బోర్డు చైర్మన్, సభ్యులను సత్కరించిన ఈఓ నాగమల్లేశ్వరరావు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ కోనేరు అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ట్రస్టు బోర్డు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. బుధవారం పంచారామ క్షేత్రంలో ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షతన ట్రస్టు బోర్డు సమావేశం జరిగింది. కోనేరులో జిగురు మట్టి కారణంగా భక్తులు కోనేరులో దిగిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. దీనిలో భాగంగా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కోనేరులో పూడిక తీసి ఇసుక వేయడానికి పనులు ప్రారంభించి, నాసిరకంగా చేశారని, అవి కూడా అసంపూర్తిగా చేశారని ట్రస్టు బోర్డు సభ్యులు ఆరోపించారు. కోనేరులో ఎంత మట్టి తీస్తే అంత ఇసుక వేస్తామని పురావస్తు శాఖ అధికారులు తెలియజేసి, అసంపూర్తిగా ఇసుక వేసి కోనేరులో నీరు పెట్టారని, గోతులు ఉండిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు ఆరోపించారు. కోనేరులో దాత గ్రావెల్ ఇచ్చారని, దానిపై ఐదు ట్రక్కుల ఇసుక వేసి నీరు పెట్టారని సభ్యులు తెలిపారు. ఈ మేరకు కోనేరుపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కార్తిక మాసం నాటికి కోనేరును ఇసుకతో నింపాలని తీర్మానం చేశారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించాలి

ఏటా ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రస్తుతం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. ప్రతి రోజు ఆలయంలో ఉదయం సాయంత్రం, పూజలతో పాటు హోమాలు నిర్వహించాలని తీర్మానించారు. హోమాలు చేయించుకొనే భక్తులు ఆలయంలో సంప్రదించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు రాని రోజున దేవస్థానం తరుపున హోమం చేస్తుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఇదే చివరి సమావేశం

పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు పదవీ కాలం బుధవారంతో ముగిసింది. దాంతో ఈ సమావేశాని చివరి సమావేశంగా తీసుకున్నారు. రెండేళ్ల పాటు ట్రస్టు బోర్డు చైర్మన్ ఉన్న మట్టపల్లి రమేష్‌బాబు, సభ్యులు కర్రి వెంకటలక్ష్మి, నాతిపాముల సూరిబాబు, యండమూరి వెంకట సుబ్బారావు, ముమ్మిడి బేబిరాణిలను దేవస్థానం తరుపున ఈఓ నాగ మల్లేశ్వరరావు సత్కరించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న చెరుకూరి దత్తు, శ్రీకాకుళపు వినయ్, చంటిలు ట్రస్టు బోర్డు సభ్యులను ఆశీర్వచనాలు అందజేశారు.

మా 'నేత' సీఎం జగన్



తాటిపర్తిలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే దొరబాబు వద్ద చేనేత కార్మికులు
- తాటిపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: మా కష్టాలు కళ్లారా చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే తీర్చిన ఏకైక నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చేనేత కార్మికులు అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో బుధవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామంలో చేనేత కుటుంబాలను కలసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ప్రతి ఇంట్లో వారిని పలకరించి ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ గతంలో ఈ గ్రామానికి వచ్చినప్పుడు చేనేత కార్మికులు టీడీపీ సానుభూతిపరులుగా ఉండేవారని, ఈ ప్రభుత్వంలో వారికి అండగా నిలచిన సీఎం వైఎస్ జగన్‌కు పూర్తి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా రావాలని చేనేత కార్మికులు కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఎంపీటీసీ నూకరాజు, దాసం వెంకటేష్, గారపాటి బుజ్జి, మొగలి చిన్న, మొగలి రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం భోజనం



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు

సామర్లకోట: బోయనపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నాసిరకమైన భోజనం పెడుతున్నారని, పురుగులతో ఉన్న బియ్యం, కుళ్లిపోయిన కోడిగుడ్లు కేంద్రంలో ఉన్నాయని ఆ గ్రామ ప్రజలు ఆరోపించారు. అంగన్‌వాడీ కార్యకర్త తీరుపై గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పోషక విలువతో కూడిన ఆహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే అంగన్‌వాడీ కార్యకర్త నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గ్రామ నాయకుడు కోట యోగి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ ఆయాకు పాడైపోయిన వంట సరకులు ఇస్తున్నట్లు తెలిపారు. దీనిపై సీడీపీఓ ఉషాను వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రంలో సరకులను పరిశీలించాలని సూపర్ వైజర్ చంద్రకళకు ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. సీడీపీఓలకు మీటింగ్ ఉండడం వల్ల తనిఖీకి వచ్చే అవకాశం లేదన్నారు. పాడైన సరకులు ఉంటే తమ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఉషా తెలిపారు. దీనిపై గ్రామంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన యువకుడు దుబాకుల మధుసూదనరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం అతని కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.10 వేలను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో అందించారు. సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణుమూర్తి, గ్రామా పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: టీడీపీ హయాంలో అట్టడుగు స్థానానికి పడిపోయిన సహకార సంఘాలకు చేయూత నిచ్చి మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం విశేష కృషి చేసిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు సహకార సంఘం అధ్యక్షుడు జ్యోతుల భీముడు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వజన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ హయాంలో అన్ని సహకార సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయన్నారు. డీసీసీబీ సైతం అక్రమాల పుట్టగా తయారైందని అటువంటి పరిస్థితుల్లో సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తగిన ఆర్థిక చేయూతనివ్వడంతో అన్ని సంఘాలు లాభాల బాటలో పయనిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన 3500 మంది రైతులకు రూ.9.53 లక్షల డివిడెండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జీ, వైఎస్సార్ సీపీ నేతలు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, సహకార సంఘం కార్యదర్శి సూరిబాబు పలువురు సంఘ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లను అందజేస్తున్న కౌన్సిలర్ నేతల హరిబాబు



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా ఈ నెల మండల పరిధిలోని 18 గ్రామాలకు 620, మున్సిపాలిటీకి 329 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. పింఛను సొమ్మును మున్సిపాలిటీ పరిధిలో ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేశారు. కొత్త పింఛన్లతో కలిపి ఈనెల 6,765 మంది పింఛనుదారులు ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మండలానికి మంజూరైన 620 కొత్త పింఛన్లతో 12,035 పింఛన్లు వచ్చాయని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. కొత్తగా మంజూరు అయిన పింఛన్లు ఆయా గ్రామాల్లో గురువారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

సుపరిపాలన ఓర్వలేకే దుష్ప్రచారం

కొత్తపల్లి: రాష్ట్రంలో ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓర్వలేక పచ్చ చొక్కా నాయకులు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచాన్ని మానుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. మండలంలోని వాకతిప్ప గ్రామ సచివాలయం వద్ద బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని విమర్శించే ముందు తమ తప్పులను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వెల్ఫేర్ అసిస్టెంట్ మంగరాజు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై వలంటీర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న కో ఆర్డినేటర్ అనూష

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కాకినాడ ఉమా మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో మానసిక రుగ్మతలు, వివిధ రకాల వ్యక్తులను గుర్తించడంపై వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో అబ్రహం లింకన్, మండలం విస్తీర్ణ అధికారి సూర్య భాస్కర్ ప్రారంభించారు. ఉమా మనో వికాస కేంద్రం కో ఆర్డినేటర్ అనూష మానసిక రుగ్మతలు, 21 రకాల వ్యక్తుల తత్వాలను వివరించారు. గ్రామాల్లో ఇటువంటి వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యాక్రమంలో ఉమా మనో వికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోర్స గ్రామానికి చెందిన కొర్లాకత్తుల తలుపులబ్బాయి (20) ఈ నెల 10వ తేదీ నుంచి కడుపునొప్పితో బాధపడుతూ 11వ తేదీన జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి ఆస్పత్రి సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ



సామర్లకోట పోలీసు స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల వివరాలను సీఐ కె.దుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ లతాకుమారి, సీఐలు అబ్దుల్ నబీ, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ పోలీసు క్వార్టరు ఆవరణలో శిథిలమైన వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు టి.సునీత, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊరూ వాడా చవితి సందడి



పిఠాపురంలో విక్రయానికి సిద్ధం చేసిన విగ్రహాలు



నాయీ బ్రాహ్మణ కాలనీలో పందిరి రాటను వేస్తున్న మహిళలు

- నవరాత్రులకు ఆలయాల ముస్తాబు
- వాడవాడలా పందిళ్ల ఏర్పాటు

పిఠాపురం: వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నియోజకవర్గంలో పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కొత్తగా రంగులు వేస్తూ, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తూ ఉత్సవ కమిటీలు బిజీగా ఉన్నాయి. అలాగే వినాయక విగ్రహాల ఏర్పాటుకు మండపాలను ఎక్కడికక్కడ సిద్ధం చేస్తున్నారు. స్థానికంగా ప్రముఖమైన జైగణేష్ ఆలయంలో చవితి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నేళ్లుగా అతి పెద్ద పాలవెల్లిని నిర్మిస్తున్న ఆలయ కమిటీ ఈ ఏడాది మరింత భారీ పాలవెల్లి నిర్మిస్తోంది. గతంలో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేయగా ఈ ఏడాది కోటగుమ్మం సెంటర్లో మెయిన్‌రోడ్డుపై ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. లక్షలాది పళ్లతో ఈ పాలవెల్లిని ఏర్పాటు చేయనున్నారు. ఆలయాన్ని ఇప్పటికే సర్వాంగ సుందరంగా అలంకరించి, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. మరోపక్క వినాయక విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. రూ.500 నుంచి రూ.50 వేల విలువైన విగ్రహాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు.

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం

పెద్దాపురం: ఈ నెల 19వ తేదీన వినాయక చవితి సందర్భంగా నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో తొమ్మిది రోజులపాటు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సన్నాహాలు చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో సీతారామస్వామి గణపతి సాయి ఆలయం వద్ద కౌన్సిలర్ విడదాసరి రాజా, తమిరి శ్రీనుల ఆధ్వర్యంలోను, మున్సిపల్ సెంటర్‌లోని ట్యాక్సీ స్టాండ్ వద్ద బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ జ్యోతి

పెద్దాపురం: ప్రతిరోజు గర్భిణులు, బాలింతలు పౌష్టిహాకారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని ఐసీడీఎస్ ఏసీడీపీఓ జ్యోతి అన్నారు. జె.తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మహోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రమం తప్పకుండా ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ బత్తిన రమణమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి, వి.ఆశాజ్యోతి, లీల, ఏసురత్నకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.